విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

సీపీఐ ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 4వతేదీ సోమవారం ఉదయం గం.10లకు బుట్టాయిగూడెంలో జరిగే సీపీఐ ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు)ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరకశ్యామల, మన్నవ యామిని, జిల్లా సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో భాగంగా రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో మహిళలకు స్పష్టమైన హామీలు ఇవ్వాలని మహిళా సమాఖ్య డిమాండ్ చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో జనరల్ బాడీ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఏలూరు జిల్లా ఇన్చార్జి అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య హాజరుకానున్నట్టు తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా సమితి పిలుపుమేరకు ఈ సమావేశానికి జిల్లాలోని మహిళా సమాఖ్య శాఖ కార్యదర్శులు, సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చెయ్యాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక బి.ఆర్. అంబేద్కర్ సెంటరు వద్ద పల్స్ పోలియో ప్రచార ర్యాలీని జెండా ఊపి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కల మందును తప్పక వేయించాలన్నారు. జిల్లాలో 1,315 బూత్ లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించారన్నారు. అధికారులు, సిబ్బంది కలసి కట్టుగా పనిచేసి నూరు శాతం పోలియో చుక్కలు మొదటి రోజునే వేసేలాగా కృషి చేయాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్ళినవారు, ఏ కారణం చేతనైన చుక్కలు ఆ రోజు వేయించక పోయినా 4,5 తేదీలు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారని తప్పక చుక్కలు వేయించాలని కోరారు. జిల్లా అదనపు డిఎంహెచ్ఓ డా.బాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవసుధా లక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటరు యస్. కీర్తి కిరణ్, ఐసిడియస్ అధికారి బి.సుజాత రాణి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగ సాయి, వైద్యాధికారులు, పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వాతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నిడమర్రు: పోలియో రహిత సమాజాన్ని చేద్దామని దీనికి వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని ఉంగుటూరు శాసనసభ్యులు శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శనివారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎమ్మెల్యేను నిడమర్రు మండలం భువనపల్లి ఆయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సి కమ్యూనిటీ హెల్త్ అధికారి జె విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎం ఎస్ యోహాన్, ఏ కృష్ణ ,ఎం నల్లయ్య, ఏఎన్ఎంలు ఎస్ జయమ్మ, ఎం ప్రేమలీల, తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర - గణపవరం: ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగినట్లు గణపవరం శ్రీ చింతలపాటి బాపి రాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉప్పలపాటి రామ చంద్ర రాజు శనివారం తెలిపారు. రెండవ సంవత్సరం పరీక్షలలో తెలుగు 72 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజర్, 69 మంది పరీక్షలు రాశారని, హిందీలో 15 మందికి ఒకరు గైర్హాజర్ 14 మంది రాశారని, సాంస్క్రిట్ 136 మందికి ఒకరు గైరాజర్ 135 రాశారని, ఒకేషనల్ 22 మందికి ఒక్కరు గైర్హాజర్ 21 మంది రాశారని మొత్తం 245 మందికి విద్యార్థులకు గాను ఆరుగురు ఆబ్సెంట్ 239 మంది పరీక్షలు రాసినట్టు తెలిపారు.

వివాహ వేడుకలో ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: భువనపల్లి గ్రామానికి చెందిన అలుమోలు నరేన్ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను శనివారం ఆశీర్వదించిన ఉంగుటూరు నియోజక వర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పత్సమట్ల ధర్మరాజు, ఆయనతో పాటుగా ఈ వేడుకలో జనసేన నాయకులు అలుమోలు అరుణ్ కుమార్, సీత రాముడు, గంధపుశెట్టి అన్నవరం, అలుమోలు భాస్కరావు, అలుమోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: విద్యార్థులు పొదుపు, ఆర్థిక అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని దానికి ఇలాంటి ఫైనాన్షియల్ లిటరసీపై గెస్ట్ లెక్చరర్ ఉపన్యాసం విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. శనివారం కళాశాలలో వాణిజ్య శాస్త్ర, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్ కర్నూల్ (ఎన్ జీవో) వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మణ కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ బ్యాక్ ఖాతాల వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వాణిజ్య శాస్త్ర శాఖ అధ్యక్షురాలు రాణి దుర్గ, పి బాల మణికంఠ, ఎస్ వెంకన్న బాబు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య సత్తా



విశాలాంధ్ర,జంగారెడ్డి గూడెం : క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షలో జంగారెడ్డిగూడెం శ్రీ చైతన్య పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, వీరిలో నలుగురు విద్యార్థులకు రూ 4వేలు బహుమతి పొందినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులు బంగారు పథకములు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్ తెలియజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఏజీఎం ఎస్. పార్థసారథి , ఆర్ ఐ సిహెచ్. ఉదయభాస్కర్ , ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్, ఏవో కె. శ్రీనివాస్ వై. మురళి, సి ఇంచార్జ్ ఎస్. సత్యనారాయణ ప్రైమరీ ఇంచార్జ్ కె. రజనీ రాణి , ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ సిహెచ్ .జ్యోతి విద్యార్థులను, తల్లిదండ్రులను సర్టిఫికెట్స్ మెడల్స్ ఇచ్చి ప్రశంసించారు.

ఆచూకీ లేని విశ్వకర్మ...

- అమలుకు నోచుకోని పథకం
- శిక్షణ పేరుతో కాలయాపన
- రుణాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: చేతి వృత్తుల వారికి ఆర్థిక చేయూత అందించి వారిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. గత సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి రోజున ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికీ 5 నెలలు గడుస్తున్నా శిక్షణ పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ పథకం అమలుకు జిల్లాకు నోడల్ అధికారి ఉన్నారు. ఆయన విశ్వకర్మ యోజన పథకం బాధ్యత చూడాల్సి ఉంది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా ప్రోత్సహించడం లేదని సమాచారం. ప్రోత్సహిస్తే తన ఓటు బ్యాంకుకు గండిపడుతుందని భావనలో ఉన్నట్టు కొందరు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఈ పథకాన్ని ప్రచారానికే పరిమితం చేశారు.

18 వృత్తులలో శిక్షణ....

ఈ పథకం కింద 18 రకాల సంప్రదాయ వృత్తుల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కార్పెంటర్ (వడ్రంగి), పడవల తయారీ, పనిముట్లు తయారీ, బ్లాక్ స్మిత్ (కమ్మరి), సుత్తులు,టూల్ కిట్ తయారీ, తాళాల తయారీ, గోల్డ్ స్మిత్, కుండల తయారీ (కుమ్మరులు), శిల్పులు (రాళు చెక్కేవారు), రాళ్లు కొట్టేవారు, చర్మకారులు (చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, ఫుట్ వేర్ కార్మికులు), మేస్త్రీలు(తాపీ పని వారు), బుట్టలు, చాపలు, చీపుర్ల తయారీ, పీచు అల్లే వారు, బొమ్మలు ఆట వస్తువుల తయారీదారులు (సంప్రదాయక), క్షురకులు, పూలు అల్లే వారు, రజకులు, దర్జీలు, చేపల వలలు తయారీదారులు శిక్షణ పొందేందుకు అర్హులు. వీరికి 5 రోజుల నుంచి 15 రోజుల వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ. 500 స్టైఫండ్ చెల్లిస్తారు. తరువాత రూ.15 వేల విలువైన టూల్ కిట్ ఇస్తారు. అనంతరం బ్యాంకు ద్వారా ఎలాంటి హామీ లేకుండా రూ.1 లక్ష రుణాన్ని అందజేస్తారు. ఈ రుణాన్ని 18 నెలలలో చెల్లించాలి. అలా చెల్లిస్తే మళ్లీ రూ.2 లక్షల వరకు రుణం ఇస్తారు. దీన్ని 30 నెలల్లో చెల్లించాలి. ఇలా పూర్తి అభివృద్ధిని బట్టి రుణాలు ఇస్తారు. సకాలంలో చెల్లిస్తే మళ్లీ పెద్ద మొత్తంలో రుణాలు అందజేస్తారు.

అర్హులు వీరే...

ఈ పథకం కింద రుణాలు పొందాలనుకునే వారు 18 ఏళ్లు నిండిన వారై ఉండాలి. ఎంతో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు ఉంటే అర్హులు కాదు. ముద్ర రుణాలు పొంది పూర్తిగా చెల్లించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. కుటుంబంలో ఒక్కరికే లబ్ధి చేకూరుతుంది.

ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం...

దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని నోడల్ అధికారి తెలిపారు. ఫేజ్ 1,2,3, దశలలో పరిశీలించిన తర్వాత జిల్లా కమిటీ నిర్ణయం మేరకు ఎంపిక చేస్తారని తెలిపారు. అయితే ఈ నెలలో సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉండటంతో ఎంపిక, అనంతరం శిక్షణ ఇవ్వడంలో కాలయాపన జరిగే అవకాశం ఉందని అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన శిక్షణ దొరక్క ఈ పథకం నత్త నడకన సాగుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ పథకం వల్ల ఎప్పటికీ లబ్ధి చేకూరుతుందోనని దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రుణాలు సకాలంలో మంజూరు చేయాలి....

పీఎం విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకున్న వారందరికీ సకాలంలో శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలి. ఈ పథకం గురించి రాష్ట్ర ప్రభుత్వం కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. నోడల్ అధికారి జిల్లాలో పర్యటించి రుణాలు సక్రమంగా అందేలా ఏర్పాటు చేస్తే చేతివృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. లేదంటే విశ్వకర్మ యోజన కర్మగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

అభ్యర్థుల ఖర్చులు మార్గదర్శకాలకు లోబడి ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: రానున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శిక్షణార్థులకు సూచించారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం నందు ఎఫ్ఎస్‌టి (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్), విఎస్‌టి (వీడియో సర్వే లైన్స్ టీం), వివిటి (వీడియో వ్యూయింగ్ టీమ్), ఎస్ఎస్‌టి (స్టాటిక్ సర్వే లైన్స్ టీం) టీంలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, అడిషనల్ ఎస్పీలు భీమారావు, ఈటీవీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ఖర్చుల రకాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్, వీడి యో సర్వలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎక్సైజ్, అకౌంటింగ్, ఎంసిఎంసి బృందాలు నిర్వహించవలసిన విధులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షలకు వరకు, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయుటకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. అన్ని బృందాలు వారికి అప్పగించిన విధంగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చులు నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా అక్రమంగా నగదు గాని వస్తువులు గాని రవాణా చేస్తున్న లేదా పంపిణీ చేస్తున్న వెంటనే ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ఈఎస్ఎంఎస్ యాప్ లో వివరాలు నమోదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకున్న పక్షంలో ఆదాయపుపన్ను అధికారి తెలియజేసి సీజ్ చేయించాలన్నారు. చెక్ పోస్టులలో సీజ్ చేసిన వివరాలను ప్రతిరోజు రిపోర్టు రూపంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డి, జిల్లా అదనపు ఎస్పి వి.భీమారావు, సెబ్ ఎయస్పి ఏ.టి.వి.రవికుమార్, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డిఎస్పీలు డి.యస్.ఆర్.వి.యస్. యన్.మూర్తి, వి.నారాయణ స్వామి రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్. అప్పారావు, ఆచంట నియోజక వర్గం ఆర్వో వి.స్వామి నాయుడు, తణుకు నియోజక వర్గం ఆర్వో బి.వెంకట రమణ, వివిధ శాఖల ఎలక్షన్స్ అధికారులు, పోలీసు అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంటు సి.హెచ్.దుర్గా ప్రసాదు, సిబ్బంది, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పూర్తి: కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు : జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పంపిణీ పూర్తి చేశారని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ , అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పీ%ఆ%ఆర్డీ, ఎన్ఆర్ఈజిఎ - కరువు మండలాల్లో పని దినాల కల్పన, తాగునీరు, పరిశ్రమల శాఖ - ఎంఎస్ఎంఈ క్లస్టర్ లకు భూ కేటాయింపు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. స్థానిక ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలినవి ప్రత్యేకడ్రైవ్ పెట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాకు 5,05,458 ఆరోగ్యశ్రీ కార్డులు రావడం జరిగింది ఈ కేవైసీ ద్వారా 4,19,964 కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మిగిలినవి త్వరితగతిన పంపిణీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ పెట్టి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ 90 శాతం జరిగిందనీ,మరో 6,984 మాత్రమే పెండింగ్ ఉందని వివరిస్తూ,ఇందుకు ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా,జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస విశ్వనాథ్, డిఎంహెచ్ఓ ఎస్.శర్మిష్ట,ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.రాజీవ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు సెంటు భూమి ఇవ్వలేదు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పోడూరు: చంద్రబాబు 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా చేసినా పేదలకు ఎక్కడా ఒక సెంటు భూమి ఇవ్వలేదని రాబోయే రోజుల్లో ఏం చేస్తాడో చెప్పడని ఎమ్మెల్యే ఆచంట ఎమ్మెల్యే చెరుకూరి శ్రీరంగనాథరాజు ఎద్దేవా చేశారు. పోడూరు మండలంలోని ఆచంట నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎనిమిది గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జగనన్న లేఔట్‌ల పేరుతో గ్రామాలలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలలో 80 శాతం మంది ఇల్లు కట్టుకున్నారని మిగిలిన వారివి నిర్మాణస్థితిలో ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాలనీలు ఏర్పరిచి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వటమే కాకుండా ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వటం జరిగిందన్నారు. జగన్ తిరిగి ముఖ్యమంత్రి అయితే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని పథకాలను అమలు చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ పేదల సొంత ఇల్లు కలను ముఖ్యమంత్రి జగన్ నెరవేర్చారని రానున్న ఎన్నికలలో ఆచంటలో వైసీపీ పార్టీని మళ్ళీ గెలిపించాలని కోరారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణ రాజు, ఎంపిటిసి పోడూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు శివాజీ రాజు, తహశీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మహాప్రస్థానంలో పూర్తి సదుపాయాలు: ప్రసాదరాజు

విశాలాంధ్ర-నరసాపురం: పట్టణంలో 14వ వార్డు బరియల్ గ్రౌండ్ వద్ద రూ.2.91 కోట్లతో నిర్మించిన మహాప్రస్థానం నూతన విశ్రాంతి భవనం, అస్థికల భద్రపరచు, వాచ్మెన్ గదులను శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో బరియల్ గ్రౌండ్‌కు వచ్చిన వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారని అన్నారు. నర్సాపురం పట్టణంలో గోదావరి నది ఒడ్డున ఉన్న స్మశాన వాటికను నరసాపురం పురపాలక సంఘం, ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.2.91 కోట్లుతో అభివృద్ధి చేశారన్నారు. మహాప్రస్థానం ట్రస్ట్ సంబంధించిన కస్తూరి శ్రీనివాస్, కనకళ్ళ సుబ్బారావు ,అద్దంకి ఏసు, హరికృష్ణ, ఏడిది కోట సత్యనారాయణ, నరసాపురం మహాప్రస్థానం ట్రస్టు వారి ద్వారా బర్నల్ గ్రౌండ్ కార్యకలాపాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ డా:కె వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు ఏడిది కోట సత్యనారాయణ,(వై కె ఎస్) ద్వారా గంగా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధనా సామాగ్రి అందజేత

విశాలాంధ్ర-ముదినేపల్లి: మండలం లోని పెదపాలపర్రు ఈదర శోభనాద్రి చౌదరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠ శాల విద్యార్థులకు, 1987 సంవత్సరం పదవతరగతి పూర్వ విద్యా ర్థులు (గోల్డెన్ ఫ్రెండ్స్) శనివారం బోధనా సామాగ్రి అందజేశారు. దివం గత బొప్పన బాబు రావు చారిటీస్ తరుపున, అన్విత గ్రూప్ సీఎండి బొప్పన అత్యుత రావు వీటిని సమకూర్చగా సంస్థ డైరెక్టర్, 1987 బ్యాచ్ విద్యార్థి నాగభూషణం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారికి వీటిని అందచేశారు. పదవ తరగతి విద్యార్థులు అందరికీ పరీక్షలకు ఉపకరించేలా అట్ట, జామెంట్రీ బాక్స్ అందించటమే కాక, సాయంత్రం స్టడీ అవర్స్ కు ఉపయోగపడేలా అదనపు విద్యుత్ సౌకర్యం, దీపాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో పెదపాలపర్రు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు బొప్పన ప్రసాద్, ఈదర సీతారామయ్య, బొప్పన శ్రీనివాస్, ఫణి ఆనంద్ (యూఎస్ఏ) పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితాను రైతులు పరిశీలించుకోవాలి

విశాలాంధ్ర-వీరవాసరం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-క్రాప్ రబీ 2023ు24 సంబంధించిన రైతుల జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి బిన్నీ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి సోషల్ ఆడిట్ లిస్టును పరిశీలించుకుని వివరాలు సరిచూసుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఆర్బికేలో గ్రామ వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించాలన్నారు. అలాగే రైతులకు ఈ-క్రాప్ అవ్వక పోయినా, వెరైటీ తప్పుగా నమోదైన అవన్నీ పరిశీలించుకుని సరిచేసుకునేందుకు ఇదోక మంచి అవకాశం అని ఆమె తెలిపారు.

రేపు సీపీఐ జనరల్ బాడీ సమావేశం

విశాలాంధ్ర - కామవరపుకోట : సీపీఐ ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం నాలుగో తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బుట్టాయిగూడెంలో జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు తెలిపారు. సమావేశం ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య హాజరవుతారని తెలిపారు. సిపిఐ కామవరపుకోట మండల సమితి సభ్యులు శాఖ కార్యదర్శి ప్రజాసంఘాల బాధ్యులు సమావేశ సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - లింగపాలెం : అన్నపనేనివారిగూడెం రహదారి మరమ్మతు పనులకు ఎమ్మెల్యే ఎలీజా శంకుస్థాపన చేశారు. నాబార్డ్ నిధులలో మరమ్మతులకు రూ. 76 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో రెండు కిలోమీటర్ల 200 మీటర్ల రహదారిని పునర్నిర్మించనున్నారు. ఈ నిధులతో రెండు కిలోమీటర్ల 200 మీటర్ల రహదారిని పునర్నిర్మించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ రవీంద్ర, రహదారుల శాఖ డిఇ రవికుమార్, జడ్పీటిసి హరినాథ్‌రాజు, సీనియర్ వైసీపీ నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు, రావి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతిగృహం తనిఖీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: చేబ్రోలు బాలికల వసతి గృహమును ఏలూరు జిల్లా విజిలెన్స్ ఫుడ్ కమిటీ సభ్యులు కోనే వీర వెంకట సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ తనిఖీల్లో విద్యార్థులకు అందించే పౌష్టికాహారమును బాగానే ఉందని తెలియజేసినారు. త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగింది. వసతి గృహ ఆఫీసర్ మీరాబాయి, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

విశాలాంధ్ర - లింగపాలెం : ప్రాథమిక పాఠశాలల్లో వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. దీనిలో భాగంగా ధర్మాజీగూడెం ప్రాథమిక ప్రధాన పాఠశాలలో నిర్వహించిన తనిఖీలో ఈయనతో పాటు పాఠశాలల ప్యానల మెంబర్లు ఖండవల్లి కుటుంబరావు, సొంగా నాగేశ్వరరావు, సరికొండ రమేష్, గుడిపూడి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సిద్ధం చేసిన టిఎల్ఎంలను పరిశీలించారు. విద్యా బోధనపై ఉపాధ్యాయులకు ఎంఇఓ పలు సూచనలు చేశారు.

కేంద్ర రాష్ట్ర పాలకులను ఓడించండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-పోలవరం: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించడంతోపాటు ఎన్డీఏలో ఉన్న పార్టీలను ఓడించాలని ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శనివారం పోలవరం మండల సీపీఐ కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు అధ్యక్షతన సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈనెల 4న ఉదయం 10గంటలకు బుట్టాయిగూడెం తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో గ్రౌండ్లో ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ సమావేశానికి జాతీయ కార్యదర్శి కె. నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్చార్జి అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలందరూ అధిక సంఖ్యలో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. మోడీ గత ఎన్నికల సందర్భంగా తన అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని, నిరుద్యోగ యువతకు ఏట రెండు కోట్ల ఉద్యోగ కల్పన చేస్తానని, నల్లధనం వెలికి తీసి ప్రతి వారి బ్యాంకు ఖాతాలో రూ.15 వేలు వేస్తామని బూటకపు వాగ్దానాలతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రకృతి వనరులైన అడవులు, మైనింగ్ సంపదనను ఆదానికి కట్టబెట్టడానికి మణిపూర్‌లో హింసను ప్రేరేపించారని ఆరోపించారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న మోడీకి ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతా,మిలటరీ సంబంధిత అంశాలను బహిరంగ సభలో ఉపయోగించుకోవడం దేశ చరిత్రలో ఏ ప్రధానమంత్రి చేయలేదని ఒక్క మోడీ మాత్రమే చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో పాలక ప్రతిపక్షాలు కేంద్రంలోని బిజెపికి వంతపాడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిర్వాసితుల జీవితాలు దుర్భరం చేశారని విమర్శించారు. పునరావాస గ్రామాల్లో విద్యా వైద్యం అందని ద్రాక్ష అయ్యాయని అన్నారు. స్మశాన వాటిక లేని దుర్భర పరిస్థితులలో కాలం గడుపుతున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని లక్ష్యంతో సైనికుల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ పోలవరం నియోజకవర్గం కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిరుమల శెట్టి రవికుమార్, పోలవరం పట్టణ కార్యదర్శి జల్లేపల్లి వేణుగోపాలకృష్ణ, సూరిబాబు సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కైకలూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరు-4,5 సచివాలయ పరిధిలోని ఎస్టీ కాలనీలో 2వ రోజుగా జరిగిన గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమానికి నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజాపాలన చేస్తున్నామని ప్రజలకు తెలియచేయటానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్య క్షులు అబ్దుల్ హమీద్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ రఫీ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, నిమ్మల సాయి, వైసీపీ సీనియర్ నాయకులు కన్నా రమేష్, తులసి పూర్ణ, సుంకర శివ, నిమ్మల శ్రీనివాసు, వసుంధర మురళీకృష్ణ, అసాని ఖాన్, పంజా నాగు, సమయం ఆంజనేయులు, కరేటి రాంబాబు, ఎస్సీ ఎస్టీ సెల్ విజిలెన్స్ మౌంటరింగ్ కమిటీ సభ్యులు కూనవరపు సతీష్, ముక్కొళ్ళ పెద్దిరాజులు, వైస్సార్ బాషా పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని పురస్కరించుకొని బయ్యనగూడెం గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది వైద్యులు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్. సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులు అలసత్వం వహించకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామాలలో ఉండే గ్రామ సచివాలయాల వద్ద పోలియో చుక్కల బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పి. హెచ్. ఎన్. మేరీ గోల్డ్, చాన్ భాష, మరియమ్మ,, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ధర్మరాజు



విశాలాంధ్ర - ఉంగుటూరు : నారాయణ పురం మురికి కాలువ వంతెన దగ్గర శనివారం రెండు బైక్ లు ఢీ కొన్న ఘటనలో నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన దంపతులు తీవ్ర గాయాలయ్యాయి. భువనపల్లి నుండి నారాయణపురం వస్తున్న ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆయన వాహనాన్ని నిలుపుదల చేసి క్షతగాత్రుడికి సపర్యలు చేయించి ధైర్యం చెప్పారు. గాయపడిన వారిని ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి ధర్మరాజు అయన వాహనంలో వారిని తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రిలో హాస్పటల్లో చేర్పించి మానవత్వం చాటుకున్నారని పలువురు ధర్మరాజును అభినందించారు.

వివేక హత్య కేసులో జగన్‌ను విచారించాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : వివేకా హత్య కేసులో ముఖ్య మంత్రి జగన్ పాత్ర ఎంత ఉందో విచారణ చేయాలని చింతలపూడి నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిజీఆర్ టౌన్ హాల్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ సొంత బాబాయిని హత్య చేసి జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే వారి పై దాడులు చేయిస్తున్నారని మండి పడ్డారు. తండ్రికి చావుకు కారకులైన వారిని చట్టానికి పట్టించాలని వివేకా కూతురు కోర్టుల చుట్టూ తిరుగుతుంద న్నారు. ముఖ్య మంత్రి జగన్ కి బుద్ధి చెప్పాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓడించి జనసేన,టీడీపీ కూటమిని గెలిపించాలని అందుకు ప్రజల సహకారం అందించాలని కోరారు. టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, తూటి గుంట రాము,పెనుమర్తి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

ఎమ్మెల్యే మంతెన

విశాలాంధ్ర - కాళ్ళ : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేసేలా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. పెద అమిరం గ్రామం నుంచి ఉండి జనసేన ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజుతో కలిసి శనివారం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసమే టీడీపీ జనసేనకలిసి పోటీ చేస్తున్నాయన్నారు. టీడీపీ అంటే జనసేన, జనసేన అంటే టీడీపీ అనే విధంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మద్యం ముట్టుకుంటే షాక్ తగిలేలా ధరలు ఉన్నాయని, ఆక్వా రైతులు ఆత్మహత్య రైతులుగా మారారని ఆయన ఎద్దేవా చేశారు. చుట్టూ నీరు ఉన్న త్రాగడానికి నీరు లేదన్నారు. బొండాడ గ్రామానికి చెందిన మందపాటి కృష్ణమూర్తి తన తాత అయినటువంటి మందపాటి రామారావు జ్ఞాపకార్థం బొండాడ పేట చర్చికి రూ.1లక్ష విరాళంగా రామరాజు,నాగరాజు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కటారి, నరసింహారాజు, అలుగు సెబాస్టిన్, అభిరుచి కాశి, గేదల జాన్, బందారు వేణు, గవర లక్ష్మి బూడి పరాలు,, వీరమల్లు శ్రీనివాస్, జనసైనికులు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పొన్నాడ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మండలం అయినాపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక శాసన సభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. అయినాపురంలో సచివాలయం-2 నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ మరియు ఓఎన్జిసి (సిఎస్ఆర్) నిధులతో నిర్మించనున్న 6 వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయినాపురం గ్రామానికి శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కరించడానికి గతంలో ఆరు వాటర్ ట్యాంకులు ప్రారంభించామని ఇప్పుడు మరో 6 వాటర్ ట్యాంకులకు భూమి పూజ చేశామనిగతంలో ఏ ప్రభుత్వం ఈ గ్రామాన్ని పట్టించుకోలేదని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స చిట్టిరాజు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెయ్యల భూలక్ష్మి చిట్టిబాబు, జడ్పిటిసి కుడుపూడి శంకర్రావు, ఎంపీపీ కోలా గంగాభవాని బాబ్జి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మోకా రామారావు.గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్బరాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి

విశాలాంధ్ర - మండవల్లి: రబీలో మినుము సాగు చేసిన రైతులందరికీ ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయిందని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎస్ కె జరీనా తెలిపారు. కానుకల్లు గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, మినుము సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరీనా మాట్లాడుతూ రబీలో మినుము పైరు సాగుచేసిన రైతులందరికీ వివరాలు, పంట నమోదు (ఈ-క్రాప్), ఈ-కేవైసీ ప్రక్రియ నమోదు చేయడం పూర్తయిందని తెలిపారు. ఈనెల1 నుంచి 3వ తేదీ వరకు ఈ-క్రాప్ చేసిన జాబితాలను పెరిగేగూడెం, లింగాల, కానుకొల్లు, అయ్యవారి రుద్రవరం, మండవల్లి, పుట్లచెరువు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ వచ్చి తమ వివరాలను తనిఖీ చేసుకోవాలని, వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా రైతులు వివిఎలకు అందచేయాలని తెలియజేశారు. కానుకొల్లు రైతు భరోసా కేంద్రం సామాజిక తనిఖీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వివిఎ జి.సంధ్య, గ్రామ సర్పంచ్ థామస్ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ

విశాలాంధ్ర - పాలకొల్లు: మానవత పాలకొల్లు మండల శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని ప్రతి నెల క్రమం తప్పకుండా పంపిణీ చేయడం అభినందనీయమని పాలకొల్లు పట్టణం కొత్తపేట అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు జి.హెన్నా తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మానవతా పాలకొల్లు మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మానవత సభ్యుడు బొక్కా రమాకాంత్ తన కుమారుడు శ్రీరామ్ సుమంత్ పుట్టినరోజు సందర్భంగా హెచ్ఐవి బాధిత 30 మంది పిల్లలకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. హెచ్ఐవీ బాధిత పిల్లలు ఆరోగ్యంగా మెలిగేందుకు దాతల సహకారంతో పౌష్టికాహారం అందజేసే కార్యక్రమంలో మా కుటుంబం భాగ స్వామ్యం కావడం సంతృప్తిగా ఉందన్నారు. ప్రతి నెల పౌష్టికాహారం అందజేస్తున్నామంటే దాతలు సహకారం మరువలేనిదని మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దాత రమాకాంత్ ను మానవ తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా కార్యదర్శి పేరిచర్ల ప్రతాప్ రాజు, సభ్యులు ధనాని సూర్య ప్రకాష్, బొక్క గంగాధర్, విన్నకోట వెంకటరమణ, తమ్మినీడి మురళీకృష్ణ, పిల్లల సంరక్షకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాన కోకిల సరోజిని నాయుడు వర్ధంతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాగోలపల్లిలో శనివారం భారత గాన కోకిల నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు సరోజిని చిత్ర పటం వద్ద ఆమెకు నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు ఆమె జీవిత విశేషాలను, గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతంచేయండి

విద్యాశాఖధికారి వెంకట రమణ

విశాలాంధ్ర - భీమవరం : జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖధికారి ఆర్.వెంకట రమణ పిలుపునిచ్చారు..శనివారం బి.ఆర్. అంబేద్కర్ సెంటరు వద్ద పల్స్ పోలియో ప్రచార ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చేపట్టనున్న పల్స్‌పోలియో వ్యాక్సిన్‌ను 1-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలను తప్పక వేయించాలన్నారు. జిల్లాలో 1,315 బూత్‌లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. 5 సంవత్సరాలలోపు ఒక లక్ష 85 వేలు మంది చిన్నారులకు పోలియో చుక్కలు వెయ్యాలని గుర్తించామన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై పట్టణాలోను , గ్రామాలలో సంబంధిత శాఖల సిబ్బంది , సచివాలయం, గ్రామ, వార్డు వాలంటరీలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది కలసి కట్టుగా పనిచేసి నూరు శాతం పోలియో చుక్కలు మొదటి రోజునే వేసేలాగా కృషి చేయాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్ళినవారు, ఏ కారణం చేతనైన చుక్కలు వేయించక పోయినా 4,5 తేదీలు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారని తప్పక చుక్కలు వేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ కోరారు.కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్ఓ డా.బాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవసుధా లక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటరు యస్. కీర్తి కిరణ్, ఐసిడియస్ అధికారి బి.సుజాతా రాణి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగ సాయి, వైద్యాధికారులు, పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వాతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

మున్సిపల్ చైర్మన్ వెంకట రమణ

విశాలాంధ్ర - నరసాపురం : నేడు జరగే పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ వెంకట రమణ అన్నారు. నరసాపురం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ పల్స్ పోలియోపై హెల్త్ ,అంగనివాడీ ,మున్సిపల్ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ బర్రె వెంకట రమణ, కమీషనర్ కె.వెంక టేశ్వ రరావు కలసి ప్రారభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట రమణ, కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని అన్నారు. మార్చి 3వ తేదీన బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో 40 బూత్ లలో మార్చి నెల మొదటి ఆదివారం ఉదయం గం. 7 నుంచి సాయంత్రం గం.5 వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు కారిచర్ల మోహన, సోనియా, సత్యభూషణ్, హెల్త్ సూపర్ వైజర్లు, ఏయన్.యం ,ఆశాలు, అంగనివాడీ , మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పాలకోడేరు : రాష్ట్ర వ్యాప్తంగా మార్చి మూడవ తేదీననేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకోడేరు మండల పిహెచ్‌సి విద్యాధికారి డా.సి.హెచ్.వి.రంగం నాయుడు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీని వైద్య సిబ్బంది పాలకోడేరులో శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా రంగంనాయుడు మాట్లాడుతూ పాలకోడేరు పిహెచ్‌సిపరిధిలో 1-5 సంవత్సారాలు అర్హులైన పిల్లలు 3,299 మంది ఉన్నారని వారందరికీ పోలియో చుక్కలు వేసేలా ఆయా గ్రామాల లోని పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయం,కమ్యూనిటీ హాల్స్ వద్ద 32 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు.అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు పిహెచ్‌సిపరిధి లోని గ్రామాలకు 150 మంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామని, పల్స్ పోలియోబూత్‌ల వద్ద ఆదివారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని అర్హులైన పిల్లలందరికీ వేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బందికి ఆయన తెలిపారు.ఈ అవగాహన ర్యాలీ లో డా.స్వర్ణ నిరంజనీ, డా.లీలా లక్ష్మి, సిహెచ్ఓ సత్యనారాయణ, పిహెచ్ఎన్‌కుమారి,డ్వాక్రా ఏపియం. భారతి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర - మండవల్లి: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా నేటి నుంచి మూడు రోజులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డాక్టర్స్ అనిలా, పవిత్ర తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి మొదలుకొని ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కల మందు వేస్తున్నారని తెలిపారు. మండలంలో నేటి నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించినున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలం మొత్తం 3504 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు ఉన్నారని,36 బూత్ లు, 16 సచివాలయాలు, రెండు స్కూల్స్ లో, ఒక అంగన్వాడి సెంటర్ లో ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం గం.7 నుంచి సాయంత్రం గం.5వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగనవాడీలు, వాలంటీర్లుతో మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వృద్ధుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - లింగపాలెం : మండలంలోని కలరాయనగూడెం గ్రామంలో జాల యేసు (64) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మృతుడు కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నాడని దానిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మాజీగూడెం పోలీసులు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతునికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

లోక్ అదాలత్ పై సమీక్ష

విశాలాంధ్ర - భీమవరం : జాతీయ లోక్ అదాలత్‌లో ఇప్పటి వరకు క్రిమినల్, రెవెన్యూ, మున్సిపల్ కేసులుపై, రాజీకి తీసుకున్న చర్యలపై సమీక్షా సమావేశాన్ని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి. అప్పల స్వామి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దాదాపు 400 రాజీ చేయడానికి వీలున్న క్రిమినల్ కేసులను గుర్తించినట్లు, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంబంధించిన సబ్ ఇన్స్పెక్టర్‌కు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఇరుపక్షాల వారికి నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి తెలి పారు. అలాగే సివిల్ కోర్ట్ లో పెండింగ్ లో ఉన్న లాండ్ ఎక్విజీషన్ కేసులు భీమవరం మున్సిపాలిటీ సంబంధించిన కేసుల రాజీ చేసే దిశగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తహసీల్దార్ దుర్గ , మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ దేవసేనలకు ఆయన సూచనలిచ్చారు. ఆకివీడు ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ, భీమవరం రూరల్ ఇన్స్పెక్టర్ సత్యకిషోర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

పోలియో నివారణకు సహకరించాలి

డీఎంహెచ్ఓ మహేశ్వరరావు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : పల్స్ పోలియోకి ప్రతి ఒక్కరూ సహకరించి పోలియో నివారణకు సహకరించాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,86 953 వ్యాక్సినేషన్ డోసులు అవసరమని అయితే రెండు లక్షల వ్యాక్సినేషన్ డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. ముందుగా ప్రాథమిక వైద్య కేంద్రాల్లో,అలాగే విలేజ్ క్లినిక్లలో వేయిస్తారని, తరువాత 4,5 తారీకులలో డోర్ టు డోర్ వెళ్లి వ్యాక్సినేషన్ వేస్తారని అన్నారు, దీనికి సంబంధించి అన్ని రకాల మొబైల్ టీమ్స్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎ, అందుబాటులో ఉంటారన్నారు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క తల్లిదండ్రులు వినియోగించుకుని పోలియో నివారణ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.దేవి సుధా పాల్గొన్నారు.

రాజోలులో దొంగల హల్‌చల్

తాళాలు వేసి ఉన్న ఇళ్లు టార్గెట్

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల వ్యవధిలో జరిగిన వరుస దొంగతనాల కారణంగా ప్రజలు హడలెత్తి పోతున్నారు. మూడురోజులు క్రితం రాజోలు ఎల్‌బి నగర్‌లో నివాసం ఉంటున్న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడుగా బొంతు మధు కుమార్ ఇంట్లో దొంగలు చొరబడి గుణాపాలతో తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న సుమారు ఐదు లక్షలు విలువ చేసే బంగారం ఎత్తుకు వెళ్లారు. ఈ సంఘటన మరువక ముందే శుక్రవారం రాత్రి మరో దొంగతనం జరిగింది. శివకోటి గ్రామంలో గాదే వెంకట సూర్య రామ మురళీ కృష్ణ ఇంట్లో దొంగలు చొరబడి తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.20 నుండి 30 లక్షలు వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బుధవారం ఒక వివాహ కార్యక్రమం నిమిత్తం కుటుంబ సభ్యులంతా కలసి వేరే ఊరు వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న నగదు, బంగారం, వెండి మాయమయ్యాయి. దీంతో దొంగతనం జరిగిందని భావించిన కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన ప్రదేశాన్ని రాజోలు ఎస్ఐ పృథ్వి పరిశీలించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించారు. రెండు చోట్లా ఒకే రీతిలో దొంగతనం జరగడంతో ఒక్కడే ఈ దొంగతనానికి పాల్పడ్డాడా, ముఠా సభ్యులు ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేవలం తాళాలు వేసి ఉన్న ఇళ్లను మాత్రమే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు నిర్ధారించారు. ప్రజలు ఇల్లు వదిలి ఎక్కడికైనా ఊరు వెళ్ళేటప్పుడు ప్రక్క ఇంటి వారికి చెప్పి వెళ్లాలని, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో పెట్టుకుని వెళ్లాలని ఎస్ఐ పృథ్వి సూచించారు.

విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : రైతాంగం రాజమహేంద్రవరం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బలివాడ శ్రీలక్ష్మి, డి అనూష, సుప్రజ, వర్ష, కావ్య బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామంలో రైతుల వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, రైతులకు ఉపయోగపడే సూచనలు సలహాలిస్తూ 45 రోజుల పాటు గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వారు తెలిపారు. రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులు వివరిస్తూ, వ్యవసాయ రంగం పట్ల విద్యార్థులు మరింత అవగాహన ఏర్పర్చుకోవాలని వీర్రాఘరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ. రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

విశాలాంధ్ర - లింగపాలెం : జిల్లాలోని లింగపాలెం మండలం ఎడవల్లి గ్రామంలో చెరువులో పడి తుమ్మలపల్లి రాజేష్, చంటి (29) మృతి చెందాడు. చెరువులో పడిన మృతుడిని స్థానికులు బయటకు తీశారు. మంచి ఈతగాడుగా గుర్తింపు ఉన్న ఈ యువకుడు చెరువులో పడి మృతి చెంద దంపై పలు అనుమానాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ధర్మాజీగూడెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - భీమవరం : ముఖ్యమంత్రి జగన్ అరాచక విధ్వంస పాలనతో విరక్తి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని, వచ్చే వారందరినీ స్వాగతిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. భీమవరంలోని జిల్లా కార్యాలయంలో మండలంలోని గొల్లవానితిప్ప గ్రామ వైసీపీ నాయకుడు నౌండ్రు రాజేంద్రప్రసాద్ తదితరులకు తోట సీతారామలక్ష్మి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ పరిపాలన చేతకాని జగన్ ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో దివాలా తీయించి అప్పుల్లో అగ్రస్థానంలో ఉన్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని జగన్ అసమర్థ ముఖ్యమంత్రిగా వైసీపీ నాయకులు గుర్తించి వైసీపీ నుండి టీడీపీలోకి వస్తున్నారని, రానున్నది తెదేపా జనసేన ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ, తెలుగుయువత అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, గ్రామ పార్టీ నాయకులు కొయ్యలగడ్డ రామకృష్ణ, కొయ్యలగడ్డ సత్యనారాయణ, మంద ఆమోసు, కోయ్యలగడ్డ చింతారావు, కొట్టు సత్యనారాయణ, గుద్దటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ముద్రగడకు ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర - భీమవరం: కస్టమర్ సర్వీసెస్‌లో నూతన విధానం వలన తక్కువ ఖర్చు, తక్కువ సంఖ్యలో ఉద్యోగులతో అత్యుత్తమ సర్వీసులు అందించవచ్చునని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముద్రగడ వెంకట సుబ్బారావు తన పరిశోధనలు ద్వారా వెల్లడించారు. సుబ్బారావు చేసిన పరిశోధనకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు .సామాన్య ప్రజలకు ఉపయోగపడే మంచి ప్రాజెక్టు చేపట్టిన డాక్టర్ ఎంవి సుబ్బారావును కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆటోమేషన్ ఆఫ్ ఐటీ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టం యూజింగ్ మిషన్ లెర్నింగ్ అండ్ ఎన్ఎల్‌పి అప్రోచెస్" అనే అంశంపై తాను రూపొందించిన పరిశోధనకు గాను ఆంధ్రాయూనివర్సిటీ పీహెచ్డీ ప్రధానం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఏయూ ప్రొఫెసర్ కె.వెంకట్రావు, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ చిట్టినేని పర్యవేక్షణలో తాను పరిశోధనలు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ సొసైటీ అప్లికేషన్స్ మరింత సమర్థవంతంగా వేగంగా సామాన్యుడికి అందే విధంగా పరిశోధనలు చేసిన డాక్టర్ సుబ్బారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, ఐటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేసిన హిమపాతం

- వాహనదారులకు ప్రాణసంకటం



విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో మంచు దుప్పటి కప్పేసింది. రహదారుల పై హిమపాతం ధారాళంగా కురవడంతో ఎదురుగా వచ్చేవారు కనిపించనంతగా దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంది. ఈ సందర్భంగ శనివారం ఉదయం 7 గంటలైనప్పటకి మంచు ధారాళంగా కురుస్తూనే ఉండడంతో జాతీయ రహదారి,ఎడిబి రోడ్డులపై ఎదురుగా వచ్చే,ముందు వెళ్ళే వాహనాలు కనిపించక పోవడంతో లైట్లు వేసుకుని నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.దీంతో వాహనాదారులకు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. రెండ్రోజులుగా చలి తీవ్రత కూడా పెరిగింది. మండలాల్లో రహదారులపై పొగమంచు కమ్మేయడంతో మండలంలోని పలుగ్రామాల్లో పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి హామీ పనులకు వెళ్ళే కూలీలు అవస్థలు పడ్డారు. సూర్యుడు వచ్చే వరకు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.ఇలానే కొనసాగితే పిల్లల,వృద్ధులు ఆరోగ్యం పై ప్రభావం చూపిస్తుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు.మరి కొంత మంది హిమపాతంలో తిరుగుతూ చల్లగాలులను ఆస్వాదిస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సత్వర చర్యలు

అవగాహనా సదస్సులో ఆర్డీవో జేఎస్ రామారావు

విశాలాంధ్ర - పెద్దాపురం : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లయిమ్‌లు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకారాన్ని అందించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జెఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో శనివారం ఎన్నికల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో వచ్చిన క్లయిమ్ పరిష్కారం పట్ల మరింత అవగాహన అవసరమన్నారు. ఆయా క్లయిమ్లు సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం. ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతి. జడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యన్నారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

భీమశంకర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలం ఇర్రిపాకలో టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకంలో శనివారం 6వ రోజు భీమశంకర స్వామి కళ్యాణం, నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నెహ్రూ, మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని భీమశంకర స్వామి కళ్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచె రాజా, జీనుమణి బాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, పాతంశెట్టి రవి, కుంచే రామకృష్ణ, సూరంపాలెం బాలు, యల్లమిల్లి సీఎం, పాతం శెట్టి బాబ్జి, వేలాదిగా భక్తులు తరలివచ్చారు.